1

# క్రీస్తు: మన ప్రసంగాంశము

అపొస్తలుల కార్యములు 8:26–40 ఇంటినుండి వందలాది మైళ్ల దూరములో నున్నవాడు, ప్రకటింపబడిన సువార్త విని దానికి విధేయుడైనవాని గూర్చి కుతూహలమును కలుగజేయు ఒక కథను తెలియజేయుచున్నది. ఈయన, ఐథియోపీయాకు చెందిన నపుంసకుడు, యేసు గూర్చి అంతకు మునుపు ఎన్నడు విననివాడు, ఆయన గూర్చి తెలుసుకొని ఆయన శిష్యుడయ్యాడు. నశించిన ఈ ఆత్మ ఒక ప్రసంగమును విని, బాప్తిస్మము పొందవలెనని మనవి చేసి, క్రీస్తునంగికరించింది. అది ఎంత శక్తిమంతమైన ప్రసంగమై యుండునుకదా! అది అతని జీవిత గమనమునే మార్చివేసింది – బహుశా, అది అతని ద్వారా, ఒక దేశ చరిత్ర గమనమునే మార్చివేసి యుండవచ్చును!

ఈ సందేశము యొక్క ప్రభావము ఆకర్షణీయమైనదై ఉండినప్పటికిని, ప్రేరేపింపబడిన రచయిత ప్రసంగమును కేవలము "ఆ లేఖనమును అనుసరించి అతనికి యేసుని గూర్చిన సువార్త ప్రకటించెను" అను కొద్ది మాటల్లో వివరించుచున్నాడు (అపొస్తలుల కార్యములు 8:35). మన సందేశములలోనుండు శక్తి క్రీస్తులో ఉన్నదని బహుశా బోధకులు దీని నుండి నేర్చుకొనవలెను! మనము ఆయనను ఎంత ఎక్కువగా ప్రకటించుచుందుమో, అంత ఎక్కువగా జీవితములు మారుచుండును మరియు అంత ఎక్కువగా ఆత్మలు రక్షింపబడును. బహు తరుచుగా, మనలను మనము సిలువ వెనుక దాచుకొనుటకు బదులుగా, సిలువను మన వెనుక దాచుకొనుచున్నాము.

ఫిలిప్పు యేసును ప్రకటించాడు. ఆయన ఏమని చెప్పాడు? ఆయన పాత నిబంధన లేఖనముతో మొదలుపెట్టాడని తప్ప, వివరమేమిటో మనకు కచ్చితంగా తెలియదు:

> ఆయన గొఱ్ఱెవలె వధకు తేబడెను; బొచ్చు కత్తిరించువాని యెదుట గొఱ్ఱెపిల్ల ఏలాగు మౌనముగా ఉండునో అలాగే ఆయన నోరు తెరవకుండెను. ఆయన దీనత్వమునుబట్టి ఆయనకు న్యాయవిమర్శ దొరకకపోయెను; ఆయన సంతానమును ఎవరు వివరింతురు? ఆయన జీవము భూమి మీదనుండి తీసివేయబడినది (అపొస్తలుల కార్యములు 8:32బి, 33; యెషయా 53:7బి, 8 చూడుము).

నిస్సందేహంగా, మెస్సీయా గూర్చి, యేసే ఈ మెస్సీయా అయి యుండెననియు, ఆయన సిలువ మరణమందు యేసు ఈ ప్రవచనంను నెరవేర్చాడనియు యెషయా చెప్పుచుండెనని పాత నిబంధనలోని ఈ వాక్య భాగమును చదువుచుండిన నపుంసకునితో ఫిలిప్పు చెప్పాడు.

ఆ తరువాత ఫిలిప్పు ఏమని చెప్పాడు? మనకు తెలియదు. బహుశా ఈ క్రింది చరిత్ర వంటి వివరణను యేసు గూర్చి చెప్పియుంటాడు.

### ఆయన జన్మ

హేరోదు మహారాజు దినములలో, యేసు బేత్లెహేమునందు జన్మించాడు (మత్తయి 2; లూకా 2). ఆయన పరిశుద్ధాత్మ వలన గర్భముధరింపబడి కన్యకు పుట్టాడు.

ఆయన తల్లి, మరియ, మరియు ఆమెకు ప్రధానము చేయబడిన భర్త, యోసేపు, లోకములో నున్న రోమీయులందరును పన్ను చెల్లింపవలెనని రోమా చక్రవర్తి చేసిన శాసనమునుబట్టి, వారి సొంత పురము గలిలయలోని నజరేతు నుండి బేత్లెహేమునకు వచ్చారు. వారు బేత్లెహేము చేరుకొన్నప్పటికి అదొక చిన్న గ్రామమైనందున బేత్లెహేము జన సమూహముతో నిండియునందున వారు పరుండుటకు సత్రము యొక్క యజమాని అనుమతించిన పశువుల శాల తప్ప మరొక చోటు వారికి దొరకలేదు. యేసు పుట్టినది అక్కడే, గనుక ఆయన తల్లి ఆయనను ఒక పశువుల తొట్టిలో పరుండబెట్టింది.

ఆయన పుట్టిన ఆనాటి రాత్రి, యేసును ఆరాధించుటకు గొఱ్ఱెల కాపరులు వచ్చారు. అటుతరువాత, ఈ చిన్న కుటుంబము ఒక చిన్న గృహములోనికి మారిన తరువాత, తూర్పు దేశపు జ్ఞానులు ఆయనను ఆరాధింపవలెనని ఆయనను వెదకుచూ వచ్చారు, వారు హేరోదు యొద్ద చేసిన విచారణలు రాజును ఎంతో కలవరపర్చినవి గనుక ఆయన శిశువును, అతని సింహాసనమునకే సవాలుగా ఉన్నట్లగుపించిన శిశువును, చంపుటకు ప్రయత్నించాడు. ఏదిఏమైనా, దేవుడు యేసు తల్లిదండ్రులను హెచ్చరించాడు, గనుక కుటుంబము ఐగుప్తునకు పారిపోయింది. హేరోదు మరణించు వరకు వారు అక్కడనే నివసించారు; ఆ తరువాత వారి జీవితమును కొనసాగించుటకు నజరేతుకు తిరిగి వచ్చారు.

## ఆయన బాల్యము

యేసు నజరేతులో పెరిగి పెద్దవాడయ్యాడు. పండ్రెండు సంవత్సరముల ప్రాయములో, ఆయన తన తలిదండ్రులతో కూడా ఆరాధించుటకు పస్కా పండుగ సమయంలో యెరూషలేమునకు వెళ్లాడు. పండుగ సంబరము ముగిసిన తరువాత యోసేపు మరియు మరియ ఇంటిదారి పట్టినప్పుడు, వారితో కూడా పయనించుచున్నవారిలో యేసు లేడని వారు గ్రహించారు. చివరకు వారు ఆయనను దేవాలయములో కనుగొన్నారు, ఆ సమయంలో ఆయన ధర్మశాస్త్రోపదేశకులను ప్రశ్నించుచు వారిచ్చుచుండిన సమాధానములను వినుచుండెను. వారికది ఒక వింత ప్రవర్తనగా అగుపించినందువలన వారు యేసును ప్రశ్నించారు, అందుకు యేసు, “నేను నా తండ్రి పనుల మీద నుండవలెనని మీరెరుగరా?” (లూకా 2:49బి) అని ప్రత్యుత్తరమిచ్చాడు. ఆ తరువాత ఆయన నజరేతుకు వచ్చి యోసేపు మరియల అండదండలను అదుపులోను జీవించుచుండెను. ఆయన ఆరోగ్యవంతంగా ఎదుగుచూ మానసికంగా చురుకైనవాడయ్యాడు; తోటి వారు ఆయనను ఎంతో ఇష్టపడ్డారు మరియు ఆధ్యాత్మికంగా ఎదుగుటకు ఆయన తన ప్రయాసములలో అతి శ్రద్ధాళుడైయుండెను (లూకా 2:52).

## ఆయన బాప్తిస్మము మరియు శోధన

ఆయన తన ముప్పదవ యేట, బాప్తిస్మమిచ్చు యోహాను చేత యొర్దాను నదిలో బాప్తిస్మము తీసికొన్నాడు. బాప్తిస్మము తరువాత, దేవుని ఆత్మ ఆయన మీదికి పావురము వలె దిగివచ్చెను, అప్పుడు ఆకాశము నుండి వచ్చిన స్వరము, “ఇదిగో ఈయనే నా ప్రియ కుమారుడు, ఈయనయందు నేనానందించుచున్నాను” అని పలికెను (మత్తయి 3:17).

అప్పుడు యేసు పరిశుద్ధాత్మ చేత, అరణ్యములోనికి కొనిపోబడెను. నలుబది దినములు

ఉపవాసముండిన తరువాత, ఆయన రాళ్లను రొట్టెలుగా మార్చవలెననియు, దేవాలయ శిఖరము మీది నుండి క్రిందికి దుముకవలెననియు, లోకములోని రాజ్యములన్నిటిని తీసికొని దానికి బదులుగా వానిని ఆరాధింపవలెననియు, అపవాదిచేత శోధింపబడిన ప్రతిసారి కూడా ఆయన, తన తృణీకారమును తెలియజేయుటకు "లేదు" అని చెప్పుచు "... అని వ్రాయబడి యున్నది" అని ప్రత్యుత్తరమిచ్చాడు. అటుతరువాత, దేవదూతలు వచ్చి ఆయనకు పరిచర్య చేసారు.

## ఆయన పరిచర్య

ఇక యేసు యొక్క మూడు సంవత్సరముల పరిచర్య ముచ్చటగా మొదలయ్యింది. ఆయన ఉపదేశములలోను ఆయన ప్రజలపై చూపించిన పరస్పర ప్రభావములలోను ఆయన ఎటువంటివాడై యుండెనో మరియు ఎప్పుడైనా జీవించిన ఏ ఇతర ఉపదేశకునివలెనైనను ఆయన లేకుండుటకు గల హేతువేమో మనము చూడగలము.

*యేసు చేసిన అద్భుతములు.* ఈ యేసు అద్భుతములు చేసాడు. నీళ్లను ద్రాక్షారసముగా మార్చుట మొట్టమొదటి అద్భుతమై యున్నది. ఆయనకు అసాధ్యమైనది ఏదియు లేకుండినది. ఆయన జనసమూహములకు కొన్ని రొట్టెలు మరియు చేపలతో ఆహారం పెట్టాడు. ప్రచండమైన తుఫాను చెలరేగుచుండిన సముద్రమును ఆయన నిమ్మళింపజేసాడు. ఆయన నీళ్ల మీద నడిచాడు. గ్రుడ్డివారికి ఆయన చూపునిచ్చాడు; కుంటివారు నడిచివెళ్లునట్లు చేసాడు, చెవిటివారు వినగలిగారు, మూగవారు మాటలాడారు. ఆయన దయ్యములను వెళ్లగొట్టాడు. రోగులను స్వస్థపర్చాడు: కుష్ఠరోగులను, రక్తస్రావముతో బాధపడుచుండిన ఒక స్త్రీని, పక్షవాతముతో బాధపడుచుండినవానిని బాగుచేసాడు. చనిపోయినవారిని సహితము లేపాడు! కనీసము ముమ్మారు, మరణించినవారిని యేసు పిలిచి మరలా బ్రతికించాడు: యాయీరు కుమార్తెను పునఃజీవింపజేసాడు; ఒక నాయీను విధవరాలి కుమారునికి నూతన జీవమిచ్చాడు; నాలుగు దినములు సమాధిలో నుండినవానిని, లాజరును లేపాడు. ఈ అద్భుతములను చేయుట ద్వారా, ఆయన దయ, సానుభూతి, మరియు జాలిగలవాడని తనను తాను చూపించుకొన్నాడు! ముఖ్యంగా, ఆయన దేవుని కుమారుడని తనను తాను రుజువు చేసుకొన్నాడు! ఆయన చేసిన అద్భుతములు వాటిని వీక్షించుచుండినవారిలోను వాటిని గూర్చి చదువువారిలోను విశ్వాసమును పుట్టించుటకు ఉద్దేశింపబడినవై యుండెను (యోహాను 20:30, 31).

*యేసు ఉపదేశములు.* యేసు అద్భుతములను చేయుచుండినవాడు మాత్రమే గాక, ఆయన ఒక ఉపదేశకుడునై యుండెను. ఎవరును అంతకు మునుపెప్పుడైనను ఉపదేశించని పాఠములను ఆయన ఉపదేశించాడు. ఆయన చేసిన పనులు ఆయన దేవుని యొద్ద నుండి వచ్చిన ఒక ఉపదేశకుడని రుజువుచేసినవి (యోహాను 3:2). ఆయన ఉచ్చరించిన మాటలు ఎలా ఉండినవంటే, "ఆ మనుష్యుడు మాటలాడినట్లు ఎవడును ఎన్నడును మాటలాడలేదు" అని ప్రజల ఆయన మాటల గూర్చి చెప్పుకొన్నారు (యోహాను 7:46). ఆయన బోధలు జనసమూహములను ఆశ్చర్యచకితులను జేసినవి ఏలయనగా ఆయన అధికారముగలవాని వలె బోధించాడు (మత్తయి 7:28, 29). ఆయన దేవుని కుమారుడై యుండినందువలననే ఆయనకు ఇంత గొప్ప అధికారముండినది.

*యేసు యొక్క అపొస్తలులు.* యేసు ఇహమును విడిచి వెళ్లిపోయిన తరువాత

ఆయన ఉపదేశములను కొనసాగించగల ఇతరులకు ఆదేశములిచ్చుటకు యేసు ఎంతో ప్రయాసపడ్డాడు. ఆయన పుడమిపైనే నిలిచియుండడని ఆయన ఆది నుండే ఎరిగియుండెను; వాస్తవమునకు, ఆయన చంపబడునని ఆయనకు తెలియును. కాబట్టి, ఆయన పండ్రెండు మందిని, "అపొస్తలులు" అని పిలువబడిన వారిని ఏర్పరచుకొని, ఆయన తన తండ్రి యొద్దకు వెళ్లిపోయిన తరువాత తన కార్యములను కొనసాగించునట్లు, వారికి మరి ఎక్కువ తీవ్రతతో నేర్పించాడు.

*యేసు మంచితనము.* యేసు మేలు చేయుచు సంచరించుచుండెను (అపొస్తలుల కార్యములు 10:38). ఆయన స్నేహితులు లేనివారితో స్నేహం చేసాడు, పాపుల యెడల ప్రియముగా ప్రవర్తించాడు, పిల్లలను ఆశీర్వదించాడు, మరియు ఆపదలో నుండిన వారందరికిని ఆపద్బాంధవుడయ్యాడు. ఆయన ఇతరుల కొరకు తన ప్రాణమును అర్పించుకొనుటకు సమస్త విషయములలోను తననుతాను ఉపేక్షించుకొన్నాడు.

*యేసు మానవత్వము.* యేసు మానవుడై యుండెను – ఎంత దూరమైనా నడువగలిగినంత బలముగలవాడైయుండెను, జీవులకవసరమగు అనేక సుఖసౌకర్యములు లేకుండా జీవించగలినంత, దినమంతా పనిచేయుటకు చాలినంత శక్తిగలవాడై యుండెను. ఆయన తన విషయంలో అధికారముగలవాడై యుండెను; ఒకని రమ్మనగానే, అతడు *వచ్చాడు.* ఒకని పొమ్మనగానే, అతడు *వెళ్ళాడు.* రూకలు మార్చుచుండినవారిని దేవాలయములో నుండి వెళ్లగొట్టాడు మరియు పరిసయ్యులను వేషధారులను కటువైన మాటల్లో బహిరంగంగా నిందించాడు. యేసు మానవుడుగా మాత్రమే కాదు, కానీ ఆయన బీదవాడైన మానవుడై యుండెను. ఆయన తన బహిరంగ పరిచర్యను ప్రారంభించిన తరువాత, ఆయనకు సొంత ఇల్లు గాని, ఒక పడవ గాని, లేక ఒక జంతువుగాని లేదు. సిరిసంపదలను సంపాదించుకొంటూ కూడబెట్టుకొనుటకు ఆయనకు సమయము లేదు; అందుబాటులో ఉండిన సమయమంతటిని ఆయన దేవుని పనులు చేయుటలోను దేవుని వాక్యమును ధ్యానింటలోను గడిపాడు.

*యేసు దైవత్వము.* యేసు ఒక మానవుని మించినవాడై యుండెను; ఆయన దేవుని కుమారుడై యుండెను. యేసు కన్యకు పుట్టుటను బట్టి, ఆ జననమును ప్రచురము చేసిన చుక్కను బట్టి, యేసు బాప్తిస్మము పొందినప్పుడు చేసిన ఘోషణనుబట్టి, యేసు చేసిన అద్భుతకార్యములనుబట్టి, ఆయన తను దేవుడు కుమారుడని ప్రకటించాడు. యేసు రూపాంతరము చెందినప్పుడు, "ఇదిగో ఈయన నా ప్రియకుమారుడు, ఈయనయందు నేనానందించుచున్నాను; ఈయన మాట వినుడి!" అని దేవుడు సెలవిచ్చాడు (మత్తయి 17:5). యేసు మరణమునకు సంబంధించిన సంఘటనల ద్వారా సహితము, ఆయనను తన కుమారునిగా దేవుడు గుర్తించాడు.

## ఆయన మరణము

యేసు పాపములేనివాడుగా జీవించాడు మరియు ఆయన ఒక మంచి మనిషని, నమ్మదగిన స్నేహితుడని, నజరేతులోని సామాన్య వడ్రంగిగా ఒక శ్రమ జీవి యని రుజువుచేసాడు. దీనంతటి తరువాత, తన బహిరంగ పరిచర్య సమయంలో మేలు చేయుచు మూడు సంవత్సరములు గడిపిన తరువాత, ఆయన యూదులు చేత పట్టబడి చంపబడినాడు.

చివరి వారములో, యేసు జీవితములో సంభవించుచుండిన సంఘటనల జోరు

వేగవంతమయ్యింది. ఆయనకు ముందు వెళ్లుచుండినవారును వెనుక వచ్చుచుండినవారును "హోసన్నా" అని కేకలు వేయుచుండగా ఆయన గాడిదనెక్కి చివరిసారిగా యెరుషలేములోనికి ప్రవేశించాడు. చివరి వారములో కూడ ఆయన ఉపదేశించుటలోను నిమగ్నమయ్యాడు. అటుతరువాత విధికృతమైన సమయం, గురువారం రాత్రి రానేవచ్చింది. ఆయన మరియు ఆయన అపొస్తలులు పస్కా విందును ఆచరించుటకు ఒక మేడ గదిలో కూడుకొన్నారు. ఆయన తన శిష్యుల పాదములు కడుగుట ద్వారా వారికి వినయము గూర్చిన ఒక మాదిరిని చూపించాడు. ప్రభు భోజన సంస్కారము వ్యవస్థాపించాడు. అప్పుడు, ఆయనతో కూడా ఉంటున్న అపొస్తలులలో ఒకడు ఆయనను అప్పగించుననియు పేతురు ఆయనను ఎరుగనని బొంకుననియు వారికి ముందుగానే తెలియజెప్పిన తరువాత, ఆయన వారితో కూడ వెలుపలికి వెళ్లి గెత్సేమనే తోటకు చేరుకొన్నాడు.

అక్కడ ఆయన ఇలా ప్రార్థించాడు: "నా తండ్రీ, సాధ్యమైతే, ఈ గిన్నెను నాయొద్దనుండి తొలిగిపోనిమ్ము; అయినను నా యిష్టప్రకారము కాదు, నీ చిత్తప్రకారమే కానిమ్ము" (మత్తయి 26:39). ఆయన ఈ మాటలనే పలుకుచు ముమ్మారు ప్రార్థించి, లేచి ఆయనను పట్టుకొనవలెనని వేచియుండిన జనసమూహము యెదుటికి వచ్చాడు.

ఆ తరువాతి సంభవములు ఒక దాని వెంట మరొకటి త్వరత్వరగా జరిగిపోయాయి. యూదా ఆయనను జనసమూహము చేతికి అప్పగించాడు. తీర్పు నిమిత్తము ఆయనను తీసుకొనివెళ్లారు. ప్రధాన యాజకుని ముందర నిలబెట్టారు, ఆయన దేవదూషణ చేసినందువలన దోషి యని తప్పుడు తీర్పు పలుకబడింది. యేసును ఎరుగనని ముమ్మారు బొంకిన పేతురు ఆ తరువాత యేసు అంతకు మునుపు అతనితో చెప్పిన మాటలు గుర్తుకు తెచ్చుకొని వెలుపలికి పోయి సంతాపపడి యేడ్చాడు. ఉదయమైనప్పుడు, యేసు యూదుల మహా సభ చేత ఖండింపబడినాడు; ఆ తరువాత ఆయనను పిలాతు యెదుటకి తీసికొని వెళ్లారు. పిలాతు యేసును ప్రశ్నించి పరిక్షించిన తరువాత, యేసును హేరోదు నొద్దకు పంపాడు, హేరోదు యేసును హేళన చేసి మరలా పిలాతు నొద్దకు పంపాడు. పిలాతు, యేసు నిర్దోషి అని ఒప్పింపబడినవాడై, యేసును విడుదల చేయుటకు ప్రయత్నించాడు; కానీ, యూదులు పట్టుబట్టియుండినందున, విడుదల చేయలేదు. సంఘటనల ఉరవడి క్రమమును మార్చలేక, యేసును కొరడాతో కొట్టించాడు, పళ్లెములో నీళ్లు తెప్పించుకొని చేతులు కడుగుకొని నీతిమంతుడైన యేసు గూర్చి అతడు నిరపరాధి యని చెప్పి, సిలువవేయబడుటకు యేసును వారికప్పగించాడు.

యేసు "గొల్గొతా" అను స్థలమునకు తీసికొనిపోబడినాడు, అక్కడ ఆయన సిలువవేయబడినాడు, మరియు ఆయనకు కుడివైపున ఒకడును ఎడమవైపున ఒకడును ఇద్దరు బందిపోటు దొంగలు ఆయనతో కూడ సిలువవేయబడిరి. ఆయన సిలువకు మేకులతో కొట్టబడి మరణించునట్లు వదిలిపెట్టబడినాడు. కాలచక్రము నెమ్మదిగా తిరిగింది; ఆయన చేతులలోను కాళ్లలోను దిగగొట్టబడిన మేకుల వలన, తలపై గుచ్చబడిన ముళ్ల కిరీటము వలన, ఎండిన మ్రానుపై మేకులతో దిగగొట్టబడిన దేహము క్రిందికి వ్రేలాడుట వలన కలుగుచుండిన భరించరాని నొప్పితో ఎవరును ఊహించలేనంత ఎక్కువ బాధనొందాడు. ఇట్టి అవమానకరమైన దృశ్యమును చూడలేకపోయిన దేవుడు ఆకాశమందంతటను చీకటిని కమ్మజేసాడు. చివరకు, యేసు "సమాప్తమైనది" అని కేక వేసిన తరువాత దాదాపుగా వెంటనే

అసువులు బాసాడు. యేసును ప్రేమించిన స్నేహితులు సంబంధిత అధికారుల యొద్ద అనుమతి తీసికొని యేసును సిలువ మీద నుండి దింపి, ఆయన దేహమును ఒక క్రొత్త సమాధిలో యూదుల సకల సదాచారములతో పాతిపెట్టారు. యేసు శత్రువులు సమాధి ద్వారమునకు రాయి పొర్లించి దానికి ముద్రవేసి సమాధిని భద్రముచేసి యేసు దేహమును ఎవరైనా ఎత్తుకపోతారేమోనని కావలివారిని కూడ ఉంచారు.

## ఆయన పునరుత్థానము మరియు ఆరోహణము

వారములోని మొదటి దినమున, యేసు మృతులలో నుండి లేపబడినాడు! ఆయన కొందరు స్త్రీలకు, ఎమ్మాయు అను గ్రామమునకు వెళ్లుచుండిన ఇద్దరు శిష్యులకు, ఒక గదిలో తలుపులు మూసికొని యుండిన అపొస్తలులకు, ఒక్క సమయమందే కూడుకొనిన ఐదువందలకు ఎక్కువైన సాక్షులను కలుపుకొని, ఇంకా ఇతరులకును, ప్రత్యక్షమయ్యాడు. ఆయన నిశ్చయముగా పునరుత్థానుడై సజీవుడైయున్నాడను సహేతుకమైన నిదర్శనము నిమిత్తము తననుతాను ప్రత్యక్షపర్చుకొనుట, ఆయన ఇహమందు దాదాపు నలువది దినములుండెను.

ఇహమును విడిచివెళ్లకు మునుపు, యేసు తన శిష్యులను ఆయన యొద్దకు పిలిచుకొని వారికి మహా ఆదేశమును ఇచ్చాడు: “మీరు సర్వలోకమునకు వెళ్లి సర్వసృష్టికి సువార్తను ప్రకటించుడి. నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును; నమ్మని వానికి శిక్ష విధింపబడును” (మార్కు 16:15, 16). వెంటనే, ఆయన ఆకాశమునకు కొనిపోబడెను. ఆయన కొనిపోబడుచుండినప్పుడు అపొస్తలులు ఆశ్చర్యముతో తేరి చూచుచుండగా, తెల్లని వస్త్రములు ధరించిన ఇద్దరు మనుష్యులు అపొస్తలులకు కనబడి వారు చూచుచుండినట్లుగా యేసు పరలోకమునకు ఎలా చేర్చుకొనబడెనో అదేరీతిగా ఆయన తిరిగి వచ్చునని చెప్పారు (అపొస్తలుల కార్యములు 1:9-11).

## ఆయన రక్షణ సమకూర్పు

అప్పుడు, యేసు తన ఆదేశములనిచ్చిన తరువాత (అపొస్తలుల కార్యములు 1:7, 8), వాగ్దానము చేయబడిన పరిశుద్ధాత్మ కొరకు, వారిని సర్వసత్యములోనికి నడిపించువాని నిమిత్తము, వేచి యుండటకై అపొస్తలులు యెరూషలేము పట్టణములోనికి వెళ్లారు. కొద్ది దినములు గడిచిన తరువాత, పెంతుకొస్తు పండుగ దినాన, పరిశుద్ధాత్మ అపొస్తలుల మీదికి దిగి వచ్చెను. అగ్నిజ్వాలలవంటి నాలుకలు విభాగింపబడినట్లుగా వారికి కనబడెను, వారు అన్యభాషలతో మాటలాసాగిరి. గొప్ప జనసమూహము కూడుకొని యుండెను, గనుక పేతురు తన మొదటి సువార్త ప్రసంగమును చేసాడు. యేసును, అద్భుతములు చేసినవానిని, మృతులలో నుండి లేపబడినవానిని, ఇప్పుడు పరలోకమందు మహిమపర్చబడినవానిని, చంపినది వారే అని తన ప్రసంగమును వినుచుండిన యూదీయ ప్రేక్షకులతో చెప్పాడు. ఈ మాటలు వారి హృదయములను కరిగించినవి గనుక వారు, “ఇప్పుడు మేమేమి చేయవలెను?” అని వారు బిగ్గరగా కేకవేసారు. అందుకు పేతురు, “మీరు మారుమనస్సు పొంది, పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసు క్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి; అప్పుడు మీరు పరిశుద్ధాత్మ అను వరము పొందుదురు” అని ప్రత్యుత్తరమిచ్చాడు

(అపొస్తలుల కార్యములు 2:38). పేతురు చెప్పిన మాటలు వినినవారు సంతోషముతో లోబడిరి; ఆ దినమున దాదాపుగా మూడు వేలమంది బాప్తిస్మము పొంది, ప్రభువు యొద్దకు నడిపింపబడి సంఘములోనికి చేర్చబడిరి.

ఈ కథ అటుతరువాత సంవత్సరలలో సంఘము స్థాపింపబడినది మొదులుకొని నిస్సందేహముగా లెక్కలేనన్ని సార్లు పునఃరుక్తమయ్యింది. సువార్తను ప్రకటించుచుండిన బోధకులు వారి సందేశములను వినుచుండినవారి పాపములను సూచించారు; క్రీస్తు మరణము, పునరుత్థానము, మరియు మహిమలోనికి చేర్చుకొనబడుట గూర్చి వారికి తెలియజెప్పారు; ఆ తరువాత క్రీస్తు మరణించుట ద్వారా వారు రక్షింపబడునట్లు వారేమి చేయవలెనని దేవుడు ఆజ్ఞాపించాడో వారికి నివేదించారు. సువార్తను వినినవారు దాని నమ్మవలెను, మారుమనస్సు నొందవలెను, ఆ తరువాత బాప్తిస్మము పొందవలెను. లోబడిన అనేకులు సామాన్యముగా క్రైస్తవులయ్యారు, యేసును వెంబడించుచుండిన వారయ్యారు.

## ఆయన రెండవ రాకడ

యేసు క్రీస్తు కథ ఇంతటితో ముగియలేదు. సరికదా ఆయన సంఘము స్థాపింపబడుటతో గాని లేదా ఆయన సువార్త ప్రకటింపబడుటతో గాని అది ముగియలేదు. అలా కాకుండా, అది తననుతాను భవిష్యత్తులోనికి ముందుకు వెళ్లుంది. యేసు క్రీస్తు మరలా రానైయున్నాడు! ఈ యేసే లోకమునకు తీర్పు తీర్చు ఒక దినమును దేవుడు నియమించియున్నాడు. ఆయన ఒకసారి పాపులను రక్షించుటకు వచ్చాడు; ఆయన వారికి తీర్పు తీర్చుటకు మరలా వచ్చును. ఆయన రక్షణను అంగీకరించినవారు పరలోకమందలి నిత్యత్వమునకై రక్షింపబడుదురు. ఆయన రక్షణను తృణీకరించినవారు నిత్య నరకాగ్నికి ఖండింపబడుదురు. యేసు క్రీస్తు మరలా వచ్చినప్పుడు, ఆయన సమస్త మానవాళికి తీర్పు తీర్చును!

## ముగింపు

ఫిలిప్పు నపుంసకునికి యేసును గూర్చి బోధించిన సందర్భములో అతనికి వినిపించిన ప్రసంగము ఇటువంటిదే అయియుంటుంది. మన ప్రభువైన యేసు కథ నపుంసకుని మనస్సును ప్రభావితం చేసినట్లు నీ మనస్సును కరిగించి కదలించుచున్నదా? దేవుని కుమారునికి నీవు లోబడవలసియున్నదని నీవు గ్రహించుచున్నావా? యేసు మంచితనము మరియు దయ గూర్చిన ఆలోచన నీవు ఆయనను వెంబడించునట్లు నీ మనస్సును ప్రేరేపించుచున్నదా? యేసు మరణమును గూర్చిన ఆలోచన నీ సోంత దోషమునుబట్టి నీకు అవమానము కలుగజేయుచున్నదా? ఆయన ఏ క్షణములోనైనా మరలా రావచ్చునను అపేక్ష తీర్పు సమయంలో ప్రభువును కలిసికొనుటకు నీవు సంసిద్ధుడవై యుండవలెనని నీలో ప్రోత్సాహకమును కలుగజేయుచున్నదా? అలాగైతే, ఆయన ఆజ్ఞలకు ప్రతిస్పందించుము. ప్రభువునందు నమ్మకముంచుము, ఆయన యెదుట నీ పాపములను ఒప్పుకొనుటకు సిగ్గుపడకుము, నీ పాపముల గూర్చి మారుమనస్సు నొందుము, ఆ తరువాత బాప్తిస్మము పొందుము. నీళ్లు అందుబాటులోనే ఉన్నవి కదా. నీవు బాప్తిస్మము పొందుటకు నిన్ను యింకా ఏమి ఆటంకపర్చుచున్నది?